

సేవ చేసేందుకే..

తాను సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్ పేర్కొన్నారు.

- 8లో ▸



ఇసుక తవ్వకాలకు..

ఇసుక తవ్వకాలకు కొత్త నిబంధనలు అమలు చేస్తారని ప్రచారం జరిగినా ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /19.1

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అక్బర్‌నగర్ శివారులో చిరుత సంచారం



రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ శివారులో గల వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా చిరుత సంచరిస్తుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం ఉదయం గ్రామశివారులో జంతువు కళేబరాన్ని గుర్తించిన పరిశోధన కేంద్రం సిబ్బంది అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి అక్కడ ఉన్న పాదాలను పరిశీలించారు. అడవి పందిపై జిట్ట పులి దాడిచేసి చంపినట్లుగా నిర్ధారించారు. ఈ ప్రాంతానికి ఒంటరిగా ఎవరు రావద్దని.. తప్పని సరిగా రావాల్సి వస్తే టపాసులు కాల్చి శబ్దం చేయాలని సూచించారు. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని.. పులి మళ్లీ వస్తే బోను ఏర్పాటు చేస్తామని ఫారెస్ట్ అధికారులు చంద్ర ప్రకాశ్, బాబు తెలిపారు.

సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ బీజేపీ లక్ష్యం..

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



సుభాష్‌నగర్: బీజేపీ ప్రభుత్వం సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ లక్ష్యంతో ముందుకు సాగుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని లిమ్రా గార్డెన్‌లో 158 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. మైనారిటీల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్, మైనారిటీ నాయకులు ఖుద్దూస్, ఖైజర్ చావూస్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, వెల్డింగ్ నారాయణ, నాయకులు బైకన్ మధు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తా



ఆర్మూర్‌టౌన్: బీజేపీ అధిష్టానం ఆదేశిస్తే నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేస్తానని ఆ పార్టీ ఆదిలాబాద్ ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. ఆర్మూర్‌లో బుధవారం నిర్వహించని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీకి 43 ఏళ్లుగా సేవ చేస్తున్న తనకు పోటీచేసే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే అతి పెద్ద కుంభకోణమైన కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నూతుల శ్రీనివాస్, సల్లరాజరాం, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, మందుల బాలు, పులియుగేందర్ పాల్గొన్నారు.

సీఎంను సన్మానించిన షబ్బీర్ అలీ



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కామారెడ్డి, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్‌రావు, మానాల మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గల్ఫ్‌లో 'క్రెడిట్' స్కాం

- క్రెడిట్ కార్డు పేరుతో ఏజెంట్ మోసం
- వీసాల పేరిట రూ. 5 కోట్లు వసూలు
- క్రెడిట్‌కార్డులు ఇప్పించి మరో రూ. 5 కోట్లు విత్‌డ్రా చేసిన ఏజెంట్
- డబ్బులు చెల్లించకపోవడంతో డిఫాల్ట్ అయిన బాధితులు
- ఇండియాకు పంపించేసిన వైనం
- దుబాయ్ నుంచి బిల్లు చెల్లించాలని ఫోన్లు
- సీపీని ఆశ్రయించిన బాధితులు



ఖలీల్‌వాడి: గల్ఫ్ ఏజెంట్లు నయా స్కాంకు తెరలేపారు. గతంలో కొందరు నకిలీ వీసాలు ఇచ్చి మోసం చేసేవారు. మరికొందరు విజిట్ వీసాపై పంపించి.. పనిచూపించకుండా.. వర్క్ పర్మిట్ ఇప్పించకుండా మోసం చేసేవారు. తాజాగా కొత్తరకం మోసానికి పాల్పడుతున్నారు. వీసాలు ఇప్పించి దుబాయ్‌కు పిలిపించుకుని కొన్ని రోజుల పాటు తమ వద్ద ఉంచుకొని.. వీరి పేర్ల మీద క్రెడిట్ కార్డుల ద్వారా లోన్లు తీసుకొని వారిని తిరిగి ఇంటికి పంపించేస్తున్నారు. దుబాయ్‌కు చెందిన క్రెడిట్ కార్డుకు సంబంధించిన బ్యాంక్ సిబ్బంది ఈఎంఐలు చెల్లించాలని బెదిరింపులకు దిగడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. దీంతో తాము తీసుకోని రుణాలకు ఈఎంఐలు ఎలా చెల్లిస్తామని బాధితులు మంగళవారం పోలీస్‌కమిషనర్ కల్మేశ్వర్‌ను ఆశ్రయించారు. స్పందించిన సీపీ వెంటనే విచారణ చేపట్టాలని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజును ఆదేశించారు.



పబ్బ భూమేశ్

వైద్యానికి డబ్బులు లేక..

రూ. 6 లక్షలు చెల్లించిన ఓ గల్ఫ్ బాధితుడి కొడుకు అనారోగ్యంతో మృతి చెందాడు. డబ్బులు లేకపోవడంతో చికిత్స చేయించలేక కొడుకును కాపాడుకోలేకపోయాడు. అలాగే మరో బాధితుడు అప్పులు ఇచ్చిన వారు వేధించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని సబ్ ఏజెంట్ భోజారం తెలిపారు. బాధితులు చెల్లించిన రూ. 5కోట్లు వారికి అందేలా చూడాలని సీపీ కల్మేశ్వర్‌ను కోరినట్లు భోజారం చెప్పారు. నాలుగు నెలల క్రితం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

విచారణ చేపడుతున్నాం

సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు గల్ఫ్‌లో జరిగిన మోసంపై విచారణ చేపట్టాం. సబ్ ఏజెంట్ భోజారం డబ్బులు ఎవరికి ఇచ్చారనే దానిపై విచారిస్తాం. బెజ్జం సుబ్బారెడ్డి, ఆరెపల్లి మహేశ్, ఆరెపల్లి నరేశ్, మోచ(బాడ్సి) రాజులకు డబ్బులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్ని అంశాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ లేని ఏజెంట్లకు డబ్బులు చెల్లించి మోసపోవద్దు.

– రాజశేఖరరాజు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ, నిజామాబాద్

అసలేం జరిగిందంటే..

దుబాయ్‌లో ఉద్యోగం కల్పిస్తామని ప్రతినెలా రూ. 40వేల నుంచి రూ. 50వేల వేతనంతో పాటు రూ. 50 లక్షల క్రెడిట్ కార్డు సౌకర్యం ఉంటుందని జిల్లా కేంద్రంలోని భవానీనగర్‌కు చెందిన ఏజెంట్ పబ్బ భూమేశ్ అలియాస్ దండిగాళ్ల భూమేశ్ అలియాస్ భూమారెడ్డి సబ్ ఏజెంట్లను నమ్మబలికాడు. దీంతో డొంకేశ్వర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన భోజారాం మరో ఇద్దరు సబ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని నిజామాబాద్, నిర్మల్, జగిత్యాలకు చెందిన 82 మంది వద్ద ఒక్కొక్కరి నుంచి రూ. 6లక్షల చొప్పున వీసాకు వసూలు చేశారు. వీరి నుంచి వసూలు చేసిన సుమారు రూ. 5కోట్లను దఫాల వారీగా పబ్బ భూమేశ్ సూచించిన వారికి చెల్లించారు. డొంకేశ్వర్ మండలం అన్నారంనకు చెందిన భోజారం నిజామాబాద్‌లోని శ్రీదేవి ట్రావెల్స్‌కు చెందిన బెజ్జం సుబ్బారెడ్డికి రూ. 2కోట్లను చెల్లించాడు. వెంటనే డబ్బులు చెల్లించినట్లు భోజారాం పబ్బ భూమేశ్‌కు వాట్సాప్‌లో వాయిస్ మేసేజ్ చేశారు. తర్వాత ఆర్మూర్‌కు చెందిన అరెపల్లి మోహన్, ఆరెపల్లి నరేశ్, మోచ(బాడ్సి) రాజులకు రూ. 3కోట్లు భోజారం చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం వీరికి దుబాయ్ విజిట్ వీసాలను దశల వారీగా ఇప్పించారు. అక్కడికి వచ్చిన తర్వాత వర్క్ వీసా ఇప్పిస్తానని చెప్పాడు. దీంతో వీసాలు వచ్చిన బాధితులు గ్రూపులుగా దుబాయ్‌కి వెళ్లారు. వీరిని పబ్బ భూమేశ్ ఏర్పాటు చేసిన రూంలో ఉంచారు.. 82 మందిలో 30 మందికి మాత్రమే వర్క్ పర్మిట్ ఇప్పించి.. క్రెడిట్ కార్డులు ఇప్పించాడు.

బాధితుల క్రెడిట్ కార్డుల నుంచి డబ్బులు విత్‌డ్రా

నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాలకు చెందిన 82 మందిలో 30 మందికి వర్క్ వీసాలు రావడంతో పబ్బ భూమేశ్ అక్కడి క్రెడిట్ కార్డు బ్యాంక్ సిబ్బంది తో అరబ్బీ, ఇంగ్లిష్‌లలో ఉన్న ఫారాలపై సంతకాలు చేయించాడు. తన అడ్రస్‌పైనే క్రెడిట్ కార్డులు తీసుకున్నాడు. అవి రాగానే వాటి నుంచి మరో రూ. 5 కోట్లు డ్రా చేసినట్లు బాధితులు సీపీకి విన్నవించారు. క్రెడిట్ కార్డులకు సంబంధించిన డబ్బులు చెల్లించకపోవడం వల్ల డిఫాల్ట్ కావడంతో పబ్బ భూమేశ్ 30 మందిని ఇండియా వెళ్లిపోవాలని.. వీసా సమస్య తలెత్తిందని.. లేదంటే జైలుకు వెళ్తారని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో బాధితులు భోజారాంనకు ఫోన్ చేసి తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దీంతో త్వరగా ఇండియాకు వెళ్తే.. ఒక్కొక్కరికి రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు తిరిగి ఇచ్చేస్తానని పబ్బ భూమేశ్ బాధితులకు చెప్పి పంపించేశాడు. ఇక్కడకు వచ్చిన తర్వాత డబ్బులు చెల్లించకుండా మోసం చేశాడు. అంతేకాకుండా దుబాయ్‌లోని క్రెడిట్ కార్డుకు సంబంధించిన బ్యాంకు సిబ్బంది బాధితులకు ఫోన్ చేసి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో వారు సీపీని ఆశ్రయించారు.

కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరు

- యథావిధిగా కొనసాగుతున్న అక్రమ డిప్యుటేషన్లు
- అర్హత లేకున్నా ఇన్‌చార్జి అధికారిగా విధులు
- వైద్యశాఖలో పాలన అస్తవ్యస్తం



నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యశాఖలో కలెక్టర్ ఆదేశాలనూ తుంగలో తొక్కుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లలో కొనసాగుతున్నారు. అర్హత లేకున్నా కొందరికి ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు అప్పగించి అక్రమాలకు అవకాశాలు కల్పిస్తున్నార ని ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. శాఖలో పాలన అస్తవ్యస్తంగా మారుతున్నా ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

ఏళ్ల తరబడిగా..

వైద్యశాఖలో నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు కొనసాగుతున్నాయి. ఏళ్ల తరబడిగా పదుల సంఖ్యలో ఉద్యోగులు శాఖలో డిప్యుటేషన్లలో కొనసాగుతున్నారు. ఆయా మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు.. ముఖ్య అధికారులకు ముడుపులిచ్చి డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇక కలెక్టరేట్‌లోని శాఖ కార్యాలయంలో పనిచేసే వారిలో కొందరు ఆఫీసుకు వచ్చి అటెండెన్సులో సంతకం పెట్టి బయట తిరుగుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే డిప్యుటేషన్‌పై ఊరికే రాలేదని.. అధికారులకు కావాల్సిందే ఇచ్చి ఇక్కడికి వచ్చామంటున్నారు.

నెలలు గడుస్తున్నా..

ఇన్‌చార్జి ఏవోను తొలగించాలని కలెక్టర్ ఆదేశించినా వైద్యశాఖ అధికారులు పట్టించుకోలేదు. నెలలు గడుస్తున్నా గుట్టుచప్పుడు కాకుండా మళ్లీ డెమో సెక్షన్‌కు సంబంధించిన అధికారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. డెమోకు సంబంధించిన అధికారులు ప్రజలకు వచ్చే వాధ్యులపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం చేయాల్సి ఉంటుంది. అయితే సదరు అధికారి జిల్లాస్థాయి అధికారిని మచ్చిక చేసుకొని మళ్లీ ఇన్‌చార్జి ఏవో పోస్టులో కొనసాగుతున్నాడు. అంతేకాకుండా డిప్యుటేషన్లు, ఇతర పోస్టుల నియమకాల విషయంలో ముడుపులు పెద్ద ఎత్తున చేతులు మారడంలో ఆయనే కీలకమని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. పాలన అస్తవ్యస్తంగా మారుతున్నా ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఉద్యోగులే ఆవేదన చెందుతున్నారు.

పరిశీలిస్తాం

జిల్లాలో డిప్యుటేషన్లలో ఎంత మంది ఉన్నారో తెలుసుకుంటాను. గతంలో ఇచ్చినవారే డిప్యుటేషన్లలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఏవోగా గంగాధర్ విధులు నిర్వహిస్తున్నారు. ఎవరూ లేకపోవడంతోనే ఆయనకు బాధ్యతలు అప్పగించడం జరిగింది. ఏవైనా పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సుదర్శనం, డీఎంహెచ్‌వో

ఏవో బాధ్యతల అప్పగింతపై విమర్శలు

వైద్యారోగ్యశాఖలో ఏవో పోస్టు అత్యంత కీలకమైంది. ఈ పోస్టులో నిబంధనల ప్రకారం డిప్యూటీ డీఎంహెచ్‌వో అర్హత ఉన్న వారికి అవకాశం ఇవ్వాలి. జిల్లాలో ఇద్దరు, ముగ్గురు డిప్యూటీ డీఎంహెచ్‌వోలున్నా వారికి ఇవ్వకుండా డెమోకు సంబంధించిన అధికారిని ఏళ్ల తరబడిగా ఇన్‌చార్జి ఏవో పోస్టులో కొనసాగించడం అనుమానాలకు తావిస్తోంది. ఇన్‌చార్జి అధికారితోనే అన్ని పనులను జిల్లాస్థాయి అధికారి చేయించుకుంటున్నారని ఆరోపణలున్నాయి. అందుకే ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల నియమకాలు జరిగాయనే విమర్శలున్నాయి. దీనిపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టి అక్రమాలపై నిగ్గు తేల్చాలని ఆదేశించారు. ఇన్‌చార్జి అధికారి అక్రమ నియమకాలు చేపట్టారని కలెక్టర్ సీరియస్ అయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో మళ్లీ జాబితాను తయారు చేయించి పారదర్శకంగా నియామకాలు చేపట్టారు.

మాధవనగర్ రైల్వేగేట్ మూసివేత



మాధవనగర్ రైల్వే గేట్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ మాధవనగర్ రైల్వేగేట్‌ను బుధవారం రాత్రి నుంచి మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) పనుల్లో భాగంగా పట్టాలకు ఇరువైపులా 6 మీటర్ల లోతుగా పనులు చేపట్టాల్సి ఉందన్నారు. పనులకు ఆటంకం కలగకుండా నెల రోజుల(ఫిబ్రవరి 23) వరకు గేట్ మూసి ఉంచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రైల్వే అధికారుల వినతి మేరకు కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఆదేశాలతో రైల్వేగేట్ వద్ద పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మూసివేస్తున్నట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వరకు ద్విచక్రవాహనాల రాకపోకలు సాగించాయి. అయితే రాత్రి నుంచి పూర్తిగా గేటు మూసివేసి రోడ్డు మూసివేస్తున్నట్లు తెలిపారు. గురువారం నుంచి వినాయకనగర్, ఆర్యనగర్ నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్లే వాహనదారులు బోర్గాం(పి), మోపాల్, కంజర, ముల్లంగి(బి) మీదుగా వెళ్లాలని, డిచ్‌పల్లి వైపు నుంచి నిజామాబాద్ వచ్చే వాహనదారులు బైపాస్ మీదుగా రాకపోకలు సాగించాలని పోలీసులు సూచించారు.

జీజీహెచ్‌లో కొట్లాట

- సెక్యూరిటీ, ఆరోగ్యశ్రీ డైట్‌సప్లయర్స్ మధ్య గొడవ
- ఒకటో టౌన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు

నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్(జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి)లో సెక్యూరిటీ గార్డులు, ఆరోగ్యశ్రీ డైట్ సప్లయర్స్ మధ్య బుధవారం గొడవ జరిగింది. మధ్యాహ్నం సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఓపీ ఎదుట ఆరోగ్యశ్రీ డైట్ సప్లయర్స్‌కు చెందిన వ్యక్తులు ఫుడ్‌ట్రాలీని వేగంగా నపుకుంటూ వచ్చి రౌండ్స్‌కు వెళ్తున్న సెక్యూరిటీ సిబ్బందిని ఢీకొట్టారు. దెబ్బలు తగలడంతో ఎందుకు వేగంగా వస్తున్నావని, నెమ్మదిగా రావచ్చు కదా అని సెక్యూరిటీ గార్డు నాగరాజు అడగడంతో సాయి అనే ఆరోగ్యశ్రీ డైట్ సప్లయర్ దూర్భషలాడుతూ సెక్యూరిటీ గార్డుపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో నాగరాజుకు దెబ్బలు తగిలాయి. సుమారు అరగంట పాటు తోపులాట జరిగింది. పోలీసులు అడ్డుకున్నా ఫలితం లేకుండా పోయింది. జీజీహెచ్ పార్కింగ్ ప్రాంతంలో సైతం ఫుడ్‌సప్లయర్స్‌కు చెందిన బయటి వ్యక్తులు వచ్చి మళ్లీ గొడవ పడడంతో పోలీసులు వారిని ఒకటో టౌన్‌కు తరలించారు.



గొడవ పడుతున్న సెక్యూరిటీ, సప్లయర్స్

ఫిర్యాదు చేసిన సెక్యూరిటీ గార్డులు

సెక్యూరిటీ గార్డు నాగరాజు, మరోవ్యక్తిపై దాడి చేసిన ఫుడ్‌సప్లయర్స్ సాయి, మరో ఇద్దరు వ్యక్తులపై ఒకటో టౌన్‌లో సెక్యూరిటీ గార్డులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కావాలనే గొడవ పెట్టుకున్నారని.. గతంలో సైతం తమపై గొడవకు దిగారని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. గొడవ విషయంలో ఆరోగ్యశ్రీకి సంబంధించిన డైట్ ఇన్‌చార్జీలు, పోలీసులు సయోధ్య కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. తమపై దాడిన చేసిన డైట్ సప్లయర్స్‌ను వెనుకేసుకొస్తున్నారని సెక్యూరిటీ గార్డులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సైతం డైట్ ఇన్‌చార్జీలకు సహకరిస్తున్నారని పేర్కొంటున్నారు.

ఫిర్యాదులు అందాయి

జీజీహెచ్‌లో గొడవ జరిగిన విషయంలో ముందుగా సెక్యూరిటీ గార్డులు ఫిర్యాదు చేశారు. మళ్లీ ఆరోగ్యశ్రీ డైట్ సప్లయర్స్ సైతం ఫిర్యాదు ఇచ్చారు. ఇరువురితో మాట్లాడుతున్నాం. తదుపరి చర్యలు తీసుకుంటాం.

– విజయబాబు, ఎస్‌హెచ్‌వో, ఒకటోటౌన్

ఎమ్మెల్యేల ఆస్తుల చిట్టా..

- జిల్లాలో అత్యధికంగా సుదర్శన్‌రెడ్డి ఆస్తి రూ. 109.97 కోట్లు
- 238 శాతం పెరిగిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆస్తి
- డాక్టర్ భూపతిరెడ్డికి రూ. 59.94 కోట్ల ఆస్తులు
- ధన్‌పాల్‌కు రూ. 27.25 కోట్ల ఆస్తులు
- పైడి రాకేశ్‌రెడ్డి ఆస్తి రూ. 18.5 కోట్లు

నిజామాబాద్‌నాగారం: గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికైన ఎమ్మెల్యేల ఆస్తుల వివరాలను ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వెల్లడించింది. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల వివరాలను సేకరించి బుధవారం విడుదల చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేల ఆస్తులు, కేసులు, విద్యార్హతలు ప్రకటించారు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రకటించిన ప్రకారం జిల్లాలో అత్యధికంగా ఆస్తి బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి ఉంది. ఆయన తన ఎన్నికల అఫిడవిట్‌లో రూ. 109.97కోట్ల ఆస్తి ఉన్నట్లు తెలిపారు. బీఏ చదువును మధ్యలోనే నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఇక మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆస్తి గత ఐదేళ్లలో 238 శాతం పెరిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో రూ. 34.76 కోట్ల ఆస్తులున్నట్లు పేర్కొన్నారు. 2018లో రూ. 10.27 కోట్లుగా చూపించారు. బీఈ చదివినట్లు.. తనపై ఒక్క కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తన అఫిడవిట్‌లో రూ. 59.94కోట్లు ఆస్తి ఉన్నట్లు తెలిపారు. ఎంఎస్ ఆర్థో చదివానని.. తనపై రెండు కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి తనకు రూ. 18.5 కోట్ల ఆస్తి ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. ఏడో తరగతి చదివినట్లు.. అయనపై ఒక కేసులు ఉన్నట్లు తెలిపారు. నిజామాబాద్‌అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తన అఫిడవిట్‌లో రూ. 27.25కోట్ల ఆస్తులు ఉన్నట్లు తెలిపారు. బీకాం వరకు అభ్యసించినట్లు పేర్కొన్నారు.

కామారెడ్డి జిల్లాలో..

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లాకు సంబంధించి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆస్తి 2018 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం రూ. 4.94 కోట్లు కాగా.. 2023 కు వచ్చేసరికి పది శాతం తగ్గింది. తాజా ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన తన ఆస్తుల విలువను రూ. 4.40 కోట్లుగా చూపించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న నలుగురు ఎమ్మెల్యేలలో తక్కువ ఆస్తి ఉన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కావడం గమనార్హం. ఆయనపై ఒక్క కేసూ లేదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రకటించింది.

- జిల్లాలో అత్యధిక ఆస్తులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కే.మదన్‌మోహన్‌రావుకు ఉన్నాయి. ఎన్‌ఆర్‌ఐ అయిన మదన్‌మోహన్‌రావు ఎంఎస్ చదివి, పలు దేశాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలను స్థాపించారు. ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో తన మొత్తం ఆస్తి విలువను రూ.72.65 కోట్లుగా చూపించారు. ఆయనపై రెండు కేసులున్నాయి.
- కామారెడ్డిలో అటు కేసీఆర్‌ను, ఇటు రేవంత్ రెడ్డిని ఓడించి వార్తల్లో వ్యక్తిగా నిలిచిన జెయింట్ కిల్లర్ కాటిపల్లి వెంకటరమణారెడ్డికి రూ.49.71 కోట్ల విలువైన ఆస్తులున్నాయి. ఆయనపై పదకొండు కేసులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. ఇంటర్ వరకు చదువుకున్నారు.
- ఎస్సీ రిజర్వుడ్ స్థానమైన జుక్కల్‌లో విజయం సాధించిన తోట లక్ష్మీకాంతారావు ఆస్తుల విలువ రూ. 8.11 కోట్లు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆయనపై రెండు కేసులున్నాయి.



దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని, వారికి రూ. 6వేల పింఛన్‌ను త్వరలోనే అమలు చేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగర శివారులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఆరుగురికి మూడు చక్రాల వాహనాలు, బ్యాటరీ ట్రై సైకిల్‌ను దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలని, ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అందరితో సమానంగా పోటీపడాలని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, నాయకులు గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, పోలసాని శ్రీనివాస్, బోడ మహేందర్, నరేశ్ ఉమ్మాజీ, చిలుక సాయిలు, అనిల్‌రెడ్డి, అశోక్, వాసు పాల్గొన్నారు.



వాహనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించండి

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక ను త్వరగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్ అథారిటీ(సీడీఎంఏ) ముఖ్య కార్యదర్శి దానకిషోర్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాము, లిక్కి శంకర్, నర్సారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, ఖాందేశ్ శ్రీనివాస్, రంగన్న పాల్గొన్నారు.



సీడీఎంఏ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

క్లుప్తంగా

బాలకిషన్‌కు డాక్టరేట్‌



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగ పరిశోధక విద్యార్థి వడ్ల బాలకిషన్‌ డాక్టరేట్‌ సాధించారు. తెయూ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ సాయిలు పర్యవేక్షణలో 'సింథసిస్‌ అండ్‌ బయోలాజికల్‌ ఎవల్యూషన్‌ ఆఫ్‌ నావెల్‌ ఫ్యూరో / థైయనో పిరిడిన్‌ డెరివెటివ్స్‌' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. అనంతరం సెమినార్‌ హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో రిజిస్ట్రార్‌ యాదగిరి, అధ్యాపకులు బాలకిషన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సైన్స్‌ డీన్‌ ఆరతి, హెచ్‌వోడీ నాగరాజు, బీవోఎస్‌ చైర్మన్‌ బాలకిషన్‌, కంట్రోలర్‌ అరుణ, ప్రొఫెసర్‌ కనకయ్య, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన గడుగు గంగాధర్‌



ఖలీల్‌వాడి: సీఎం రేవంత్‌రెడ్డిని పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్‌ హైదరాబాద్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

26న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌ టోర్నీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కేబీఏ ఇండోర్‌ స్టేడియంలో ఈనెల 26, 27వ తేదీల్లో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్‌ టోర్నీ నిర్వహించనున్నట్లు కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎండీ అహ్మద్‌ బుధవారం తెలిపారు. డబుల్స్‌ పద్ధతిన నిర్వహించే ఈ టోర్నీ లో అన్ని కేటగిరిల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజు రూ. 600 ఉంటుందని తమ పేర్లను 9440295523, 9912179291 నంబర్లకు ఫోన్‌ చేసి నమోదు చేయించుకోవాలన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతి అందిస్తామన్నారు.

29న నిధి ఆప్కే నికట్‌

నిజామాబాద్‌ సిటీ: పీఎఫ్‌ చందాదారుల సమస్యలు పరిష్కరించే నిధి ఆప్కే నికట్‌ కార్యక్రమాన్ని ఈ నెలా 29న నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలలో నిర్వహించనున్నట్లు పీఎఫ్‌ కమిషనర్‌ గణేశ్‌కుమార్‌ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర మోటర్స్‌(హైదరాబాద్‌రోడ్డు)లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి సీహెచ్‌వీ శ్రవణ్‌కుమార్‌, కామారెడ్డి జిల్లా చిన్న మాల్లారెడ్డిలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి జి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని కమిషనర్‌ పేర్కొన్నారు. పీఎఫ్‌ చందాదారులు, యజమానులు, పింఛన్‌దారులు తగిన ఆధారాలతో హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

ఆగ్రోస్‌ దుకాణం తనిఖీ



మాక్లూర్‌: మండల కేంద్రంలోని తెలంగాణ రైతు ఆగ్రోస్‌ కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారిణి పద్మ, తహసీల్దార్‌ మహ్మద్‌ షబ్బీర్‌ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎరువులు నిల్వ ఉంచిన గోదాంను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఎరువులతో పాటు పురుగు మందులను అందుబాటులో ఉంచాలని యజమాని కరుణాకర్‌కు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

రైస్‌ మిల్లుల్లో తనిఖీలు

రుద్రూర్‌: మండలంలోని పలు రైస్‌ మిల్లులను సివిల్‌ సప్‌లై అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. రైస్‌ మిల్లుల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. బియ్యం శాంపిల్లను సేకరించారు. పీడీఎస్‌ బియ్యం సరఫరా అవుతుందనే ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

ఇసుక తవ్వకాలకు పాత నిబంధనే..!

- గత ప్రభుత్వం అమలు చేసిన పాలసీ ప్రకారమే తవ్వకాలు
- ఇసుక పర్మిట్ల జారీలో పారదర్శకంగా వ్యవహరించాలంటున్న ఉన్నతాధికారులు



సుంకెట్‌ వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న స్థానికులు

మోర్తాడ్‌: ఇసుక, మొరం తవ్వకాలకు కొత్త నిబంధనలు అమలు చేస్తారని ప్రచారం జరిగినా ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో పాత నిబంధనల ప్రకారమే వర్తిస్తాయని వెల్లడైంది. ఇసుక, మొరం తవ్వకాలతో ప్రభుత్వ ఖజానాకు నష్టం కలుగకుండా ఉండేందుకు పర్మిట్లను జారీ చేయడం, అక్రమ తవ్వకాలు లేకుండా చూడాలని ఉన్నతాధికారులు మండల అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పెద్దవాగు, కప్పలవాగు, ఇతర వాగులు, గోదావరి, మంజీర నదుల నుంచి ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. అలాగే వరద కాలువ, ఆయా ప్రాంతాలలోని కొండల నుంచి మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఇసుక తవ్వకాలకు సంబంధించి ప్రైవేటు భవనాల నిర్మాణాలకు ట్రాక్టర్‌ ఇసుకకు రూ.900లు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఇసుకను తరలిస్తే రూ.650 చొప్పున ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంది. మొరం తవ్వకాలకు తక్కువ మొత్తంలోనే చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వం అమలు చేసిన పాలసీనే ఈ ప్రభుత్వం కొనసాగించనుందని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక, మొరం తవ్వకాలకు అధికారులు అనుమతి ఇవ్వలేదు. పాలసీలో మార్పులు ఉంటాయనే ఉద్దేశంతో అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఇసుక, మొరంలకు కొరత తీవ్రమైంది. అనేక చోట్ల నిర్మాణాలు ఆగిపోయాయి. పాలసీలో మార్పులు ఉండవని స్పష్టత రావడంతో ఇసుక తరలించడానికి అనుమతులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

పర్మిట్లు జారీ చేస్తాం..

ఇసుక తవ్వకాలకు పాత పాలసీ ప్రకారమే అనుమతులు ఇస్తాం. రెండు మూడు రోజుల్లో పర్మిట్లను జారీ చేస్తాం. నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవు.

– వినోద్‌, ఆర్డీవో, ఆర్మూర్‌

సేవ చేసేందుకే రాజకీయాల్లోకి..



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి

సుభాష్‌నగర్‌: ప్రజాసేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి అన్నారు. పార్టీ రూరల్‌ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తన నియామకానికి కృషి చేసిన జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌ షా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అట్టడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ఫలాలు అందాలంటే కేవలం బీజేపీతోనే సాధ్యమని తెలిపారు. రెండు, మూడు మండలాలకు పరిమితమైన తనకు రూరల్‌ టికెట్‌ ఇచ్చి బీజేపీ ప్రోత్సహించిందని, ఇప్పుడు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తల కృషితో గతంలో ఎన్నడూ లేని విధంగా రూరల్‌లో బీజేపీకి 50వేల ఓట్లు వచ్చాయన్నారు. తనకు ఎప్పటికీ రాజకీయ గురువు మండవ వెంకటేశ్వర్‌రావు అన్నారు. నరేంద్ర మోడీని మరోసారి ప్రధానమంత్రి చేసేందుకు జిల్లాలో శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు.

నేడు బాధ్యతల స్వీకరణ..

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు దినేశ్‌ కులాచారి తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ అర్వింద్‌, ఎమ్మెల్యేలు ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, జిల్లా మాజీ అధ్యక్షులు, బీజేపీ అభ్యర్థులు, జిల్లా ఇన్‌చార్జులు, ప్రభారీలు హాజరవుతారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి పోతన్‌కర్‌ లక్ష్మీనారాయణ, పార్లమెంట్‌ కన్వీనర్‌ గద్దె భూమన్న, నాయకులు తిరుపతిరెడ్డి, నక్క రాజేశ్వర్‌, రాజేశ్వర్‌రెడ్డి, వినోద్‌కుమార్‌, శ్రీనివాస్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

బాలికల్లో రక్తహీనత నిర్మూలించడమే లక్ష్యం



నిజామాబాద్‌నాగారం: బాలికల్లో రక్తహీనత నిర్మూలించడమే లక్ష్యమని జిల్లా ఇమ్యునైజేషన్‌ అధికారి అశోక్‌ తెలిపారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న గురుకుల పాఠశాల, కళాశాలలో అనీమియా ముక్త్‌ భారత్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల్లో రక్త హీనత నిర్మూలణే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థినులకు మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి అరవింద్‌, డాక్టర్‌ అజమాత్‌, కళాశాల ప్రిన్సిపాల్‌ రాగలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఎస్‌సీ సందర్శన



భిక్కనూరు: హైదరాబాద్‌లోని నేషనల్‌ రిమోట్‌ సెన్సింగ్‌ సెంటర్‌(ఎన్‌ఆర్‌ఎస్‌సీ)ను బుధవారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌ క్యాంపస్‌ ప్రిన్సిపాల్‌ సుధాకర్‌గౌడ్‌ సందర్శించారు. ఎన్‌ఆర్‌ఎస్‌సీ ట్రెనింగ్‌ అండ్‌ అవుట్‌ రీచ్‌ ప్రోగ్రాం హెడ్‌ జి.శ్రీనివాస్‌రావుతో సమావేశమై సౌత్‌క్యాంపస్‌ జియో ఇన్ఫర్మాటిక్స్‌ విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌ గురించి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, దోమకొండ గ్రామాభివృద్ధి కోసం విలేజ్‌ ఇన్ఫర్మేషన్‌ సిస్టంను ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై చర్చించారు. పలు అంశాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని, సహకారాన్ని అందిస్తామని శ్రీనివాస్‌రావు హామీ ఇచ్చారని సుధాకర్‌ గౌడ్‌ తెలిపారు. ఆయన వెంట సౌత్‌ క్యాంపస్‌ అధ్యాపకుడు నారాయణగుప్తా ఉన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన ఫుట్‌బాల్‌ లీగ్‌



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్‌



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తూ..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఉమెన్స్‌ డిగ్రీ కళాశాలలో అండర్‌–13 బాలికల ఫుట్‌బాల్‌ లీగ్‌ టోర్నమెంట్‌ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో బాలికల ఫుట్‌బాల్‌ లీగ్‌ టోర్నమెంట్‌ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫుట్‌బాల్‌ సంఘం ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ, రాష్ట్ర అధ్యక్షుడు మంతెన రాజేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మీర్‌ ఫరూఖ్‌ అలీ, డాక్టర్‌ కవితారెడ్డి, కేర్‌ ఫుట్‌బాల్‌ అకాడమీ చైర్మన్‌ నరాల సుధాకర్‌, జిల్లా ఫుట్‌బాల్‌ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంఎ జావిద్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



అంజయ్య (ఫైల్‌)

నస్రుల్లాబాద్‌: మండలంలోని గండి ప్రాంతంలో అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై లావణ్య బుధవారం తెలిపారు. మృతుడు నిజామాబాద్‌ జిల్లా పాతంగల్‌ మండలం కల్లూర్‌ గ్రామానికి చెందిన జంగంవార్‌ అంజయ్య(48)గా పోలీసులు గుర్తించారు. అంజయ్య గత నెల డిసెంబర్‌ 27న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. నస్రుల్లాబాద్‌ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులకు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో అంజయ్య కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ బాధ భరించలేకే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య సరిత చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మరొకరు..



మల్లేశ్‌ మృతదేహం

మోర్తాడ్‌: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన మల్లేశ్‌(46) మోర్తాడ్‌గుండా వెళ్తుండగా ఓ పంట పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య



శ్రీనివాస్‌(ఫైల్‌)

ఆర్మూర్‌ టౌన్‌: మండలంలోని గోవింద్‌పేట్‌ గ్రామానికి చెందిన గజిబిజికర్‌ శ్రీనివాస్‌(30) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌ బాబు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు భార్యతో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య తల్లిగారింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్‌ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

పేకాట స్థావరం పై దాడి

బోధన్‌టౌన్‌: పట్టణంలోని చెక్కి చెరువు సమీపంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు బుధవారం దాడి చేశారు. పక్కా సమాచారం పేకాట స్థావరంపై దాడి చేసి 14 మందిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ ఫోర్స్‌ సీఐలు అంజయ్య, అజయ్‌ బాబు తెలిపారు. దాడిలో వీరి నుంచి రూ. 42,290 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

దుర్కిలో..

నస్రుల్లాబాద్‌: మండలంలోని దుర్కిలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై లావణ్య బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురి అరెస్టు చేశామని వారి నుంచి రూ. 1210 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడిలో సిబ్బంది సాగర్‌గౌడ్‌, ఖాజాపాషా, మహేశ్‌ ఉన్నారు.

యువకుడి అదృశ్యం



నరేందర్‌

కామారెడ్డి క్రైం: మున్సిపల్‌ పరిధిలోని టేక్రి యాల్‌ గ్రామానికి చెందిన నరేందర్‌ అనే యువకుడు అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు బుధవారం తెలిపారు. నరేందర్‌ జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో ల్యాబ్‌ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 2న హైదరాబాద్‌ వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కమిషనర్‌ బదిలీకి విశ్వప్రయత్నాలు

- ఆర్మూర్‌లో విధుల్లో చేరి ఏడాది కూడా పూర్తి కాని వైనం
- బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అధికార పార్టీ నాయకుల ఆరోపణలు



ఆర్మూర్‌ మున్సిపల్‌ కార్యాలయం



ప్రసాద్‌ చౌహాన్‌ మున్సిపల్‌ కమిషనర్‌

ఆర్మూర్‌: గత ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించాడన్న నెపంతో ఆర్మూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌ ప్రసాద్‌ చౌహాన్‌ను బదిలీ చేసేందుకు పలువురు అధికార పార్టీ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావడంతో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో విధుల్లో చేరిన అధికారులపై కాంగ్రెస్‌ నాయకులకు అపనమ్మకం చోటు చేసుకుంటోంది. దీంతో ఆర్మూర్‌ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో పైరవీ కారణంగానే ఆర్మూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌గా ప్రసాద్‌ చౌహాన్‌ బాధ్యతలు తీసుకున్నట్లు అధికార పార్టీ నాయ కులు ప్రచారం చేస్తున్నారు. తాజాగా మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పండిత్‌ వినీతపై అవిశ్వాస తీర్మాన సమావేశ సమయంలో కమిషనర్‌ బీఆర్‌ఎస్‌ పార్టీకి అనుకూలంగా వ్యవహరించాడంటూ ఆరోపణలు చేస్తున్నారు. చైర్‌పర్సన్‌ వర్గంతో పాటు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్‌ నాయకులు మంత్రి వద్దకు వెళ్లి కమిషనర్‌ను బదిలీ చేయించి ఆయన స్థానంలో తమకు అనుకూలంగా ఉండే అధికారిని బదిలీపై తీసుకువచ్చేందుకు పట్టుబడుతున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట..

2023 మార్చి 1న ఆర్మూర్‌ మున్సిపల్‌ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్‌ చౌహాన్‌ బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేశారు. ఇక్కడ గతంలో విధులు నిర్వహించిన అధికారులు పాలక వర్గం ఒత్తిడికి తలొగ్గి ఖాళీ ఇళ్ల స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించడంపై బీజేపీ కౌన్సిలర్లు ఆందోళన చేస్తుండటంతో కమిషనర్‌ నిబంధనల అమలు విషయంలో సిబ్బందిని కట్టడి చేశారు. వివాదాల జోలికి వెళ్లకుండా మున్సిపల్‌ సిబ్బందితో కలిసి పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కమిషనర్‌ స్థాయి అధికారికి పార్టీల రంగు పులిమి బదిలీ చేయించే కార్యక్రమం కొనసాగుతోంది. ఆర్మూర్‌ బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఈ విషయమై స్పందిస్తూ నియోజకవర్గంలో తన ప్రమేయం లేకుండా మున్సిపల్‌ కమిషనర్‌ బదిలీకి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా కమిషనర్‌ బదిలీ జరగకుండా అడ్డుకుంటానని పార్టీ శ్రేణులతో అన్నట్లు సమాచారం.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బాన్సువాడ ఎంపీపీ నీరజావెంకట్రాంరెడ్డి

బాన్సువాడ రూరల్‌: మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని బాన్సువాడ ఎంపీపీ నీరజావెంకట్రాంరెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ మండల పరిషత్‌ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇంటి బిల్లులు వెంటనే చెల్లించాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. హన్మాజీపేట్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్‌ ఆఫీసర్‌ను నియమించి వైద్యసేవలు మెరుగు పర్చాలని ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి కోరారు. బాన్సువాడలో కోర్టు భవన సముదాయం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, నర్సింగ్‌ కళాశాల పనులు మే చివరికల్లా పూర్తి చేస్తామని పంచాయతీరాజ్‌ అధికారులు తెలిపారు. ఆర్టీసీ డీఎంకు బదులుగా కొన్నేళ్లుగా కిందిస్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని సభ్యులు ముక్తకంఠంతో ఖండించారు. కోతుల బెడద నివారణకు ఈసారి హరితహారంలో అటవీ ప్రాంతానికి అనుకుని ఉన్న గ్రామాల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఉద్యాన, పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టిసారించాలని అధికారి సంతోషి కోరారు. 38 నెలలకు సంబంధించి డ్వాక్రా గ్రూపులకు వడ్డీలేని రుణాల డబ్బులు రావాల్సి ఉందని సీసీ సాయిరెడ్డి తెలిపారు. బుడిమి పాఠశాలలో సైన్స్‌ ఉపాధ్యాయుడిని నియమించాలని కో–ఆప్షన్‌ సభ్యుడు ఖమ్రొద్దీన్‌ కోరారు.

3.5 కిలోల గంజాయి పట్టివేత



నందిపేటలో స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

నందిపేట్‌: మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా నుంచి గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు జిల్లా కేంద్రంలోని గౌతంనగర్‌ కాలనీకి చెందిన జిలకర ప్రసాద్‌, విద్యాసాగర్‌గా గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి పీఎస్‌కు తరలించినట్లు ఆర్మూర్‌ రూరల్‌ సీఐ గోవర్ధన్‌రెడ్డి, స్థానిక ఎస్సై రాహుల్‌ తెలిపారు.

నిందితులకు సెల్‌ఫోన్లు కూడా లేవట..!

గంజాయి పట్టివేతలో దొరికిన ఇద్దరు నిందితులు నందిపేట్‌ మండలంలో ఎవరికి సరఫరా చేస్తున్న విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలుస్తోంది. ఎవరికి సరఫరా చేస్తున్నట్లు నిందితులు తెలుపడం లేదని, కనీసం వారి వద్ద సెల్‌ ఫోన్లు కూడా లేవని పోలీసులు పేర్కొన్నారు. తాము గంజాయి సేవించే వారికి ప్రత్యక్షంగానే విక్రయిస్తామని నిందితులు వెల్లడించినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఇంత పెద్దమొత్తంలో దొరికిన 3.5 కిలోల గంజాయిని నిందితులు నేరుగానే విక్రయించడం ఎలా సాధ్యమవుతుందనేది మండల ప్రజల్లో నెలకొన్న ప్రశ్న. ఈ గంజాయిని సదరు నిందితులు మండల కేంద్రానికి చెందిన పలువురు పెద్ద మనుషుల కోసమే తెచ్చినట్లు తెలుస్తోంది. కానీ గంజాయి విక్రయదారు పేర్లను పోలీసులు మాత్రం బయటకు చెప్పకపోవడం గమనార్హం.

అంజనిలో 800 గ్రాముల గంజాయి..



పెద్దకొడప్‌గల్‌: అక్రమంగా విక్రయిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ డి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అంజని గ్రామనికి చెందిన నర్మల హనుమాండ్లు అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి అతని ఇంట్లో దాడి చేయగా 800 గ్రాముల ఎండు గంజాయి దొరికిందన్నారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడిలో ఎస్సై అభిషేక్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ ఎల్లయ్య, కానిస్టేబుళ్లు పరశురాం, నవీన్‌ రెడ్డి, శ్రీధర్‌, అనిత, ప్రేమలత పాల్గొన్నారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యంతో పోలీసులు

ఎడపల్లి: మండలంలోని కర్నాపల్లిలో మినీ డీసీఎంలో తరలిస్తున్న రెండు క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై విక్రం బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు వాహనాన్ని పట్టుకొన్ని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాహనాన్ని పీఎస్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌..

వేల్పూర్‌: మండలంలోని పడగల్‌ నుంచి లక్కోర వైపు బుధవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ తెలిపారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతిపత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌తో ఎస్సై